ఎం.ఎకె దత్తు మృతి యుటిఎఫ్‌కు తీరనిలోటు

కడప అర్బన్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకులు అక్షయ కుమార్ దత్ (77) శనివారం రాత్రి 9.30 కు అనారోగ్యంతో హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్ లో మరణించారని, ఆయన మృతి తీరని లోటని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పాళెం మహేష్ బాబు తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ భవన్ లో దత్తు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మి రాజా, పాళెం మహేష్ బాబు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమరావతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి 2004లో ఉద్యోగవిరమణ పొందారని, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గా, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్, చైర్మన్‌గా, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. ఉద్యోగవిరమణ అనంతరం హైదరాబాదులో స్థిరపడ్డారని, అప్పటినుండి 2021 వరకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో పూర్తికాలం కార్యకర్తగా స్వచ్ఛందంగా పనిచేశారని తెలిపారు.

అధికార, ప్రతిపక్షాలు మేల్కోవాలి

- కరువు సహాయక చర్యలు చేపట్టని ప్రభుత్వం
- కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణమేది?
- ప్రజాప్రణాళికతో ఎన్నికల ప్రచారం
- విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్ వెల్లడి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

బిజెపితో లోపాయికారీ పొత్తు ద్వారా వ్యతిరేక ఫలితాలు తథ్యమని తెలంగాణా ఎన్నికల ఫలితాలే రుజువు చేశాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి లకు తెలంగాణా ఎన్నికల ఫలితం కనువిప్పు కలిగించి ఉంటుందన్నారు. తెలంగాణాలో బిఆర్ఎస్ సర్కారు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నప్పటికీ ఓటమి పాలు కావాల్సి రావడాన్ని గమనించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి సంక్షేమాల్ని ఏదో ఒక్కదాన్ని నమ్ముకుంటే మునగడం ఖాయమని తేలిపోయిందని చెప్పారు. రాష్ట్రంలోని వైసిపి సర్కారు కూడా సంక్షేమ పేరుతో ముందుకెళ్తోందని, సంక్షేమం ద్వారా అధికారంలోకి రావాలనుకోవడం అసాధ్యమని తెలిపారు. ఎపిలో మార్పు రావడం తథ్యమన్నారు. అయితే టిడిపి స్వతంత్రంగా వ్యవహరిస్తే ఎన్నికల్లో ఫలితం లభిస్తుందన్నారు. బిజెపితో పొత్తు కారణంగా మైనార్టీ, ప్రోగ్రెసివ్, సెక్యులర్, డెమోక్రటిక్, అభ్యుదయ, శాంతికాముకులు, విద్యాధికారుల ఓట్లను నష్టపోతారని హెచ్చరించారు. బిజెపి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. పోలవరం మొదలుకుని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ వరకు అన్యాయం చేసిందని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం సీట్లు కావాలని ఎవరినీ అడగబోదని, బిజెపి వ్యతిరేక పార్టీలతో అవగాహన మేరకు ఎంపిక చేసుకున్న నియోజకవర్గాల్లో స్వతంత్రంగానే పోటీ చేస్తుందని ప్రకటించారు. అధికార వైసిపిని ఓడించాలంటే బిజెపితో సంబంధాల కారణంగా సాధ్యం కాదన్నారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, కరువు సహాయక చర్యలు లేవని విమర్శించారు. కడపలో ప్రభుత్వ రంగంలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని ఉద్యమిస్తే జిందాల్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు చొరవ తీసుకున్నప్పటికీ, ఎటువంటి పురోగతి లేదన్నారు. వైఎస్ జగన్‌ను నమ్మి రాయలసీమ అత్యధిక సీట్లను కట్టబెట్టి మోసపోయిందని ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి కల్పన అంశాల్లో నిరాశ పరిచిందన్నారు. కేంద్రంలోని బిజెపి రాష్ట్రాన్ని మోసం చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి రాష్ట్రానికి రావాల్సిన హక్కుల గురించి అడిగిన దాఖలాల్లేవని విమర్శించారు. రాష్ట్రంలో బటన్ నొక్కుడు ద్వారా ఇచ్చినట్లే ఇచ్చి, ఇసుక, మద్యం, వ్యాట్‌ల పేరుతో లాగుకుంటున్నారన్నారు. కడప జిల్లాలో లక్షల ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నాయని, బినామీల చెరలో ఉన్న భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరిన ఫిర్యాదును, ఫైలును మూలనపడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కూడా కల్పించడం లేదన్నారు. రాష్ట్రంలో రూ.60 పెట్రోల్, వంట గ్యాస్ రూ.400, నిరుద్యోగభృతి సైతం ఇవ్వొచ్చనే పేరుతో రూపకల్పన చేసిన ప్రజాప్రణాళికను అమలు చేస్తామనే పేరుతో ఎన్నికల్లోకి వెళ్తామన్నారు. ఈమేరకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా క్యాంపెయిన్ చేస్తామని తెలిపారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపికి వ్యతిరేకంగా ఓట్లడగడానికి ప్రజాసంఘాలు ఇంటింటికీ వెళ్లే పనిలో ఉన్నాయన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి పాల్గొన్నారు.

'మిచౌంగ్' ప్రభావం ఎంతెంత!

- ఆకాశం మేఘావృతం..జల్లులతో సరి
- 11 మండలాల్లో వర్షపాతం నిల్
- సిద్ధవటంలో 7.6 మి.మీ నమోదు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావం నామమాత్రంగా కనిపిస్తోంది. రెండ్రోజుల కిందటి నుంచి ఆకాశం మేఘావృతమైంది. మొదటిరోజు శనివారం ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల సమయంలో జల్లులు కురవడం, అనంతరం మరుసటి రోజు ఆదివారం తెల్లవారు జామున జల్లులకు పరిమితమైంది. మిచౌంగ్ తుఫాన్ పట్ల పెంచుకున్న ఆశలు అడియాశలు కావడం ఎంతగానే నిరుత్సాహపరిచింది. జిల్లాలోని 36 మండలాల్లో అత్యధికంగా సిద్ధవటం మండలంలో 7.6 మి.మీ వర్షపాతం నమోదుకు పరిమితమైంది. మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో రబీ సీజన్‌లో జిల్లాలో పశ్చిమ ప్రాంతంలోని సుమారు 26 మండలాల్లో సుమారు 2.32 లక్షల ఎకరాల్లో ఎకరాల్లో బుడ్డశనగ పంట సాగవుతున్న సంగతి తెలిసిందే. వర్షాభావం కారణంగా విత్తనం విత్తనం విత్తడానికి అవకాశం లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆశాకిరణంగా భావించిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావం అత్యల్పంగా నమోదవుతుండడం తీవ్ర నిరాశను కలిగిస్తోంది.

సిద్ధవటంలో 7.6 మి.మీ నమోదు

జిల్లాలో కడప, బద్వేల్, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్లున్నాయి. బద్వేల్ రెవెన్యూ డివిజన్‌లో అత్యధికంగా 7.6 మి.మీ, బద్వేల్‌లో 4.2 మి.మీ, ప్రొద్దుటూరులో 3.8 మి.మీ, పులివెందుల్లో 3.4 మి.మీ మాత్రమే నమోదు కావడం గమనార్హం. జిల్లాలోని 36 మండలాల్లో 11 మండలాల్లో చినుకు జాడే కనిపించకపోవడం గమనార్హం. వీటితోపాటు మిగిలిన 25 మండలాల్లో అర్ధ పదును దాటి వర్షపాతం నమోదైన దాఖలాలు కనిపించడం లేదు.

ఉపశమనం అత్యల్పమే

జిల్లాలో వర్షాభావం కారణంగా నిలువునా ఎండిపోతున్న పంటలకు ఆశించిన ఊరట లభించడం లేదు. జిల్లాలోని 71 వేల ఎకరాల్లో పప్పుదినుసుల పంటలు సాగులో ఉన్నాయి. ఇప్పటివరకు 26.87 శాతం విస్తీర్ణంలో పంటలు సాగులో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా 13 వేల ఎకరాల్లో కంది, 39 వేల ఎకరాల్లో మినుము, పెసలు, కందులు, పత్తి, జొన్న, మొక్కజొన్న వంటి పంటలకు మిచౌంగ్ తుఫాన్ జల్లులు ఉపశమనం కల్పిస్తాయని ఆశ ఫలించే అవకాశం కనిపించడం లేదు. ఈనెల ఐదు, ఆరు తేదీల వరకు తుఫాన్ ప్రభావం కొనసాగుతుందనే అంచనాల నేపథ్యంలో ఏమేరకు ఉపశమనం లభించనుందో వేచిచూడాల్సి ఉంది.

వర్షాధార పంటలకు ఉపశమనం

మిచౌంగ్ తుఫాన్ సోమవారం గణనీయ ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఫలితంగా రబీ సాగులోని బుడ్డశనగ 80 వేల ఎకరాల వరకు సాగులోకి వచ్చే అవకాశం ఉందని అంచనా. ఇతర వర్షాధార పంటలు కందులు, మినుములు, పెసలు, జొన్న, మొక్కజొన్న తదితర పంటలకు ఉపశమనం లభించే అవకాశం ఉంది.

-ఎ.నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సంచాలకులు, కడప.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు

ఉద్యోగులను వేధిస్తే పతనం తప్పదు : ఎస్‌టియు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులను వేధించిన పాలకులకు గుణపాఠం తప్పదని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న హెచ్చరించారు. కడపలోని వివిఆర్ ఎస్టీయు భవన్‌లో ఆదివారం నిర్వహించిన రాయలసీమ జిల్లాల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో తీవ్ర ఆందోళనతో, మానసిక వేదనతో బతుకులు వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇలాంటి నిరంకుశ ప్రభుత్వాలకు తెలంగాణ ఎన్నికల ఫలితాలు గుణపాఠం కావాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ, 2023 జూన్‌తో 11వ పిఆర్‌సి గడువు ముగిసినందున, జూలై నుంచి 12వ పిఆర్‌సి అమలు కావాల్సి ఉన్నందను 45 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలు, పిఆర్‌సి, డిఎ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంరాజు, చంద్రశేఖర్, బాలగంగిరెడ్డి, దాదాపీర్, ఇలియాస్ భాష హరిప్రసాద్ రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సీనియర్ నాయకులు సురేష్ బాబు, కడప, నంద్యాల,అనంతపురం జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, అజాంబేగ్, సూర్యుడు, రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కూనంనేని సాంబశివరావు గెలుపు పట్ల హర్షం

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలంగాణ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజయం పట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలో ఫాసిస్టు, కార్పొరేటు విధానాలకు పాల్పడుతున్న బిజెపిని, అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతూ అహంకారానికి, అక్రమాలకు చిరునామాగా మారిన టిఆర్ఎస్‌ను ఓడించడం అభినందనీయమన్నారు. ఈ విజయం తెలంగాణ రాష్ట్ర ప్రజల గొంతుక అసెంబ్లీలో వినిపించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఓపెన్ చెస్ టోర్నీ విజేత దేవేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - కడప

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని మస్తాన్‌వల్లి వీధిలో హాల్ ఆఫ్ చెస్‌లో నిర్వహించిన ఫస్ట్ వైఆర్ఎస్‌డిసిఎ ఓపెన్ చెస్ టోర్నమెంటులో పోరు మామిళ్లకు చెందిన దేవేంద్ర నాథ్ రెడ్డి విజేతగా నిలిచాడు. ఈ టోర్నమెంట్లో జిల్లా నలుమూలల నుంచి 38 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదు రౌండ్ల పాటు జరిగిన టోర్నమెంట్‌లో పోరుమామిళ్లకు చెందిన దేవేంద్రనాథ్ రెడ్డి ఐదు రౌండ్లకు ఐదు పాయింట్లు సాధించి మొదటి స్థానం దక్కించుకున్నాడు.. ద్వితీయ స్థానంలో కడపకు చెందిన వంశీకృష్ణ, తృతీయ స్థానంలో సీనియర్ చదరంగం క్రీడాకారిణి గోపల్లెకు చెందిన ఉమాదేవి నిలిచారు. నాలుగు నుంచి పదవ స్థానం వరకు ఇనోక్, తేజేష్, గుణవర్ధన్, లిఖిత్, చిన్మయి, లలిత, అక్షయ్, తేజోమయి నిలిచారు. విజేతలకు బహుమతులను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి, కోచ్ తవసు చేతుల మీదుగా అందజేశారు. టోర్నమెంట్‌కు చీఫ్ ఆర్బిటర్‌గా రేటెడ్ క్రీడాకారుడు శ్రీకాంత్ వ్యవహరించారు.

విజేతలుగా నిలిచిన దేవేంద్రనాథ్ రెడ్డి, వంశీకృష్ణ, ఉమాదేవి

మల్బరీ సాగుతో ప్రయోజనం

- ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం
- కుటీర పరిశ్రమ తరహాలో సాగు చేయాలి
- ఏటా ఐదు దశల్లో ఆదాయం
- పట్టు పరిశ్రమశాఖ ఏడీ శ్రీనివాసులరెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడపప్రతినిధి

మల్బరీ సాగుతో అధిక ప్రయోజనం చేకూరుతుంది. కుటీర పరిశ్రమ తరహాలో సాగు చేస్తే మరింత ఆదాయం లభిస్తుంది. దీనికి సమర్థ యాజమాన్య పద్ధతులను జోడించాలి. దీనికితోడు ఇటీవలి నూతన రకపు వంగడాలతో పంటలను సాగు చేసుకోవాలి. ఆధునిక మార్కెటింగ్ సదుపాయం కారణంగా గణనీయంగా ఆదాయం లభిస్తోంది. సరుకును తూకం వేసిన వెంటనే పేమెంట్ చెల్లింపుల వ్యవస్థ ఏర్పాటైంది. స్వల్పకాలిక పంటల తరహాలో 45 రోజు నుంచి 70 రోజుల వ్యవధిలో ఆదాయం లభిస్తోంది. తెగుళ్లు సోకే అవకాశం ఉండదు. వాణిజ్య పంటల తరహాలో లక్షలాది రూపాయల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయే అవకాశం ఉండదని పేర్కొంటున్న కడప పట్టు పరిశ్రమలశాఖ ఏడి అన్నపురెడ్డి శ్రీనివాసులరెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

మల్బరీ వివరాలు తెలపండి ?

జిల్లాలో 400 ఎకరాల్లో మల్బరీ సాగులో చేయాల్సి ఉంది. 2022 -23 ఆర్థిక సంవత్సర చివరి నాటికి 250 ఎకరాల లక్ష్యానికిగానూ 222 ఎకరాల్లో సాగు చేయడమైంది. దీంతో 89.15 శాతం లక్ష్యాన్ని అందుకోవడమైంది. జిల్లావ్యాప్తంగా 340 మంది రైతులకు రూ.269 కోట్ల మేరకు ఆదాయం లభించే అవకాశం ఉంది.

మల్బరీ ఫామ్‌లెన్ని?

రెండు మల్బరీ ఫామ్స్ ఉన్నాయి. మైదుకూరు నియోజకవర్గంలోని వనిపెంట, కడప నగర సమీపంలోని ఊటుకూరు ప్రాంతాల్లో పెంచుతున్నాం. ఒక్కో ఫారానికి రెండు లక్షల మల్బరీ నారు మొక్కలను పెంచి రైతులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచుతున్నాం. రూ.2 చొప్పున నర్సరీ మొక్కలను అందజేస్తాం. వనిపెంటలో 25 వేల పత్తి గుడ్లను చాకీ కట్టి, ఎనిమిది రోజుల తర్వాత రైతులకు సరఫరా చేస్తాం. రూ.2,600 చొప్పున వసూలు చేసి వంద గుడ్లను అప్పగించడం జరుగుతోంది.

ప్రోత్సాహకాల వివరాలు తెలపండి?

ఎకరా నారు మొక్కలకు రూ.18,500 ఇస్తాం. షెడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు, ఎస్‌సి, ఎస్‌టిలకు 3.60 లక్షలు కేటాయిస్తున్నాం. పరికరాలు, స్టాండు, ప్లాస్టిక్ తట్టలు, నేత్రికములు (చంద్రికలు) నిమిత్తం రూ.75, 000 మంజూరవుతుంది. ఇందులో ఎస్‌సి, ఎస్‌టిలకు 90 శాతం, ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ అందజేస్తాం.

మల్బరీ విస్తరణ చర్యలేమిటి?

ఊటుకూరు, వనిపెంట ప్రాంతాల్లో మల్బరీ సాగు పట్ల ఆర్‌కెవివై పథకం కింద అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ సబ్సిడీలు, సాగు లాభదాయకతను వివరిస్తాం. దీంతోపాటు వనిపెంటలో చాకీ పురుగుల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా అభ్యుదయ రైతులను ఆకర్షిస్తున్నాం. ఫలితంగా మల్బరీ సాగు విస్తీర్ణాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం.

గూళ్ల రకాలెన్ని, ఇన్‌సెంటివ్స్ వివరాలు?

బైఓల్టేన్‌లో డబుల్‌హైబ్రీడ్స్, సి.పి రకాలు. తెల్లగూళ్లు, ఏప్రిల్, మే, జూన్‌లో సాగు చేసుకోవచ్చు. సిపిగూళ్లు. తెల్లగూళ్లకు మార్కెట్లో కిలో రూ. 700, సిపి గూళ్లకు రూ.350 ఇన్‌సెంటివ్ కింద ఇచ్చే అవకాశం ఉంది. రైతులే గూళ్లను మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించుకోవాలి. గూళ్ల కొనుగోలు అనంతరం నగదును చెక్కుల రూపంలో అందజేస్తారు.

మార్కెట్ల వివరాలు తెలపండి?

మదనపల్లి, కదిరి, ధర్మవరం, పలమనేరు, హిందూపురం మార్కెట్లలో విక్రయించుకునే అవకాశం ఉంది. కర్నాటకలో రాంనగర్, సిద్దలగట్ట మార్కెట్లు అందుబాటులో ఉన్నాయి.

సాగు సీజన్ల గురించి చెప్పండి?

జూన్ నుంచి మార్చి వరకు మల్బరీని సాగు చేసుకోవచ్చు. సిబి రకం, బైవోల్ట్ రకం. సిబి రకం వేడి వాతావరణంలో సాగు చేసుకోవచ్చు. బైవోల్డ్ రకం వేసవిలో సాగు చేసుకోవాలి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు బైవోల్డ్ సీడ్, మార్చి నుంచి జూన్ వరకు సిబి రకం రకాలను సాగు చేసుకోవాలి.

మల్బరీ దశలను వివరించండి?

నాలుగు జరాలు, ఐదు దశలు ఉంటాయి. గుడ్డు నుంచి పురుగు బయటికి వచ్చేది మొదటి దశ, మూడు రోజుల తర్వాత జరానికి పోవడం జరుగుతుంది. 24 రోజుల్లో పురుగు రూపంలో లార్వా దశ వస్తుంది. ఆరు నుంచి ఎనిమిది రోజుల తరువాత గూడు కట్టుకోవడాన్ని పీపా దశ అంటారు. ఐదవ రోజు మార్కెట్ పోవడం జరుగుతుంది. ఐదో రోజు మార్కెట్ తీసుకెళ్లి ఇ-యాక్షన్ ద్వారా రీలర్స్‌కు విక్రయించాలి. రేటు ఇష్టం లేక పోతే సెకెండ్, థర్డ్ యాక్షన్స్‌కు వెళ్లొచ్చు. విక్రయ అనంతరం గంట తర్వాత రైతు ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

షెడ్ల ఏర్పాటు, సంరక్షణ ఎలా ?

ఊరు బయట, పొలాల్లో షెడ్లు ఏర్పాటు చేయాలి. 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 35 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో షెడ్లు నిర్మించాల్సి ఉంది. యూనిట్ విలువ రూ.4 లక్షలు అయితే ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ, ఎస్‌సి, ఎస్‌టి 90 శాతం సబ్సిడీ ఇస్తారు. రూ.3.60 లక్షలు వస్తుంది. షెడ్ల అడుగు భాగంలో న్యూస్ పేపర్ పరిచి షూట్ ఫీడింగ్ (కొమ్మలు వేయడం) చేయాలి. నేత్రికలు, చాకీ కట్టెలు ఏర్పాటు చేయాలి. సున్నం కొట్టడంతో క్రిమి కీటకాదులు నశించిపోవడంతో తెగులు అనేది ఉండదు. ఫలితంగా లేబర్ ఛార్జీ తగ్గుతుంది. కొమ్మ అధిక సమయం ఫ్రెష్‌గా ఉంటుంది.

సాగు తీరుతెన్నుల గురించి తెలపండి?

మొక్కల మధ్య మూడు నుంచి ఐదు అడుగుల వ్యత్యాసం ఉండాలి. గాలి పారడంతో ఆకులు పండుబడకుండా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా తోట ఆరోగ్యవంతంగా ఉంటుంది. జిల్లాలో కడప, బద్వేల్, పులివెందుల, మైదుకూరు ప్రాంతాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగులో ఉంది.

పంట దశలను వివరించండి?

మూడు నెలల పాటు నారు సాగు చేయాల్సి ఉంటుంది. నాలుగున్నర నెలకు కోత దశకు చేరుకుంటుంది. ప్రతి 45 రోజులకోసారి పంట కోతకు వస్తుంది. ఈలెక్కన ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు తీసే అవకాశం ఉంది. ఎకరా సాగుకు 250 నుంచి 300 గుళ్లు మేపవచ్చు. కోతకు రూ.70 వేల చొప్పున ఆరు కోతల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. ఈలెక్కన ఎకరానికి రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

పెద్ద దర్గాలో ప్రార్థన చేస్తున్న హీరో నాని

పెద్ద దర్గాను సందర్శించడం ఆనందంగా ఉంది

- ప్రముఖ సినీ హీరో నాని

ప్రజాశక్తి - కడప అర్బన్

దర్గాను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని న్యాచురల్ స్టార్ హీరో నాని అన్నారు. ఆదివారం పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయనకు దర్గా నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను నానికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'హాయ్ నాన్న' సినిమా ఈ నెల 7వ తేదీ విడుదల కాబోతుందని పేర్కొన్నారు. ప్రేక్షకులు, అభిమానులు తప్పకుండా ఆదరించాలని కోరారు. అంతకు ముందు విజయదుర్గాదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ను చూసేందుకు అభిమానులు భారులు తీరారు.

విభిన్న ప్రతిభావంతులకు సహకారమే లక్ష్యం

కడప అర్బన్/ కడప : విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై అవగాహన పెంపొందించడం, గౌరవం హక్కులు, వారికి సహాయ సహకారాలు అందించడమే విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ముఖ్య లక్ష్యమని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రెటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. ఆదివారం డిఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో కడపలోని రామాంజనేయపురంలో ఉన్న హెలెన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దేశంలోని జనాభాలో 4 నుంచి 8 శాతం మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారన్నారు. విభిన్న ప్రతిభావంతుల విద్య కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేశామని చెప్పారు. హక్కుల చట్టం 2016 గురించి వివరించారు. మానసిక హెల్త్ కేర్ ఆక్ట్ 2017 గురించి వివరించారు. వైకల్యం ఉన్న పిల్లలకు కళా సాంస్కృతిక, వినోద మార్గాలను ప్రోత్సహించడం, వ్యాప్తి చేయడం, విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి జడ్జి చేతుల మీదుగా మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీనియర్ న్యాయవాది, ఎక్స్ నామినేటెడ్ మెంబెర్స్ లోక్ అదాలత్ డాక్టర్ జాల ప్రభాకర్, హెలెన్ కెల్లర్స్ బదిరుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ దౌలాట్ ఖాన్, ప్రిన్సిపల్ మసుతా బేగం, ఉపాధ్యాయులు, విభిన్న ప్రతిభావంత పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బద్వేలు : పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా జిల్లా సమగ్ర శిక్షణ ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక అధికారిత శిబిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు నాగార్జున రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు ఆత్మస్థైర్యం, మనోధైర్యం నింపే దిశగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో 731 మందికి వివిధ రకాల ఉపకరణాలను అందజేశామని చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారుడు మాట్లాడుతూ గతంలో కొద్దిమందికే ఉపకరణాకు ఇచ్చేవారని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ప్రభుత్వంలో వేలాదిమంది విభిన్న ప్రతి భావంతులకు ఇలాంటి ఉపకారణాలు ఇవ్వడం సంతోషకరమని, వీటిని సద్వినియోగం చేసుకొని జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్పొరేట్ చైర్మన్ రమణమ్మ, మున్సిపల్ అధ్యక్షుడు సుందరరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి ఈగ యద్దారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, గిద్దలూరు నియోజకవర్గ పరిశీలకుడు పాల్గొన్నారు.

'బిసిలకు జగన్ అన్యాయం'

కడప అర్బన్ : రాష్ట్రంలో 60 శాతం బిసి కులాల ఓట్లతో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి వారికి తీరని అన్యాయం చేశారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన బిసి ఆత్మీయ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కులానికి ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఒక్క పైసా కేటాయించలేదని వాపోయారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బిసిలకు తెలుగుదేశం హయాంలోనే ప్రాధాన్యత కల్పించారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో బిసి రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించారని చెప్పారు. ప్రతి వ్యక్తి తలపై మూడు లక్షలు అప్పు చూపి, తిరిగి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా సిఎం జగన్ గుర్తింపు పొందారని అన్నారు. చంద్రబాబు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన యువత విదేశాల్లో ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. పభుత్వంలో యువతకు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. బీసీలు ఐక్యమత్యంతో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవిని గెలిపించాలన్నారు. కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛారి.జ రెడ్డప్ప గారి మాధవి మాట్లాడుతూ బడుగు, బలహీన, వర్గాల కోసమే టిడిపి ఆవిర్భవించిందని చెప్పారు. బిసిలఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ఉన్న వారికి రిజర్వేషన్ తగ్గించారన్నారు. అనంతరం వైసిపి నుంచి టిడిపిలో చేరుతున్న చిన్న బాబుకు టిడిపి కండువా కప్పి మాధవి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరుతున్న చిన్న బాబు

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

వైసిపిలో 40 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్, ఇందిరానగర్‌కు సంబంధించిన 40 కుటుంబాలు ఆదివారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక వైసిపి కార్యాలయం వద్ద దండే రవి ప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

తెలుగుగంగ కాలువను పరిశీలిస్తున్న రైతు నాయకులు

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - చాపాడు

రైతు సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులపై ఏపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ పేర్కొన్నారు. ఆదివారం రైతు సేవా సమితి సభ్యులతో కలిసి మైదుకూరు మండలం వనిపెంట ప్రాంతంలో తెలుగుగంగ పంట కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎవి రమణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయినప్పటి నుంచి గత ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతులకు సహాయం చేయడంలో, పెండింగ్ నీటి ప్రాజెక్టులు పూర్తి కోసం నిధులు కేటాయించడంలో చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు చేయూతనిచ్చి వ్యవసాయం దండగ అని రైతును నిర్లక్ష్యం చేస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కులాల పేరుతో సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించి రైతును నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, మండల నాయకులు నాను బాల శివయ్య, ఆవుల నాగేష్, పోలయ్య, ఎన్‌వి శేఖర్ పాల్గొన్నారు.

వాలంటీర్ల జీతాల్లో కోత

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని వాలంటీర్లకు సంబంధించిన జీతాల్లో అధికారులు కోత విధించినట్లు తెలిసింది. వేంపల్లె మండల వ్యాప్తంగా దాదాపు 160మందికిపైగా ఆయా గ్రామాల్లో వాలంటీర్లు పని చేస్తున్నారు. వీరు ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలకు చేర వేస్తుండడంతో వారికి ప్రభుత్వం పారితోషికం ఇస్తోంది. అయితే ఇటీవల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఇడుపులపాయను విచ్చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు సిఎం విధుల్లో పాల్గొనాలని అధికారులు ఆదేశించారు. వీరిలో కొందరు వాలంటీర్లు మాత్రమే సిఎం విధులకు హాజరయ్యారు. హాజరుకాని వాలంటీర్లకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా దాదాపు 100 మంది జీతాల్లో రూ.1000 నుండి రూ.1200 వరకు అధికారులు కోత విధించినట్లు సమాచారం. జీతాల్లో కోత విధించడంతో కొందరు వాలంటీర్లు బహిరంగంగా అక్కడక్కడ ఈ విషయం చెప్పుకొని బాధపడుతున్నారు. గతంలో సచివాలయాల్లో వృద్ధాప్య పింఛన్లలో అవినీతి చేసిన సిబ్బందిపై ఎలాంటి చర్యలు లేవు.. కానీ అతి తక్కువ గౌరవ వేతనంతో పని చేస్తున్న వాలంటీర్ల వేతనాల్లో అధికారులు కోతలు ఏమిటని వారు వాపోతున్నారు. వేతన కోతల్లో అధికారులు ఒకరిపై ఒకరు నెపంవేసుకోవడంతో మధ్యలో తాము నష్ట పోతున్నామని పలువురు వాలంటీర్లు పేర్కొంటున్నారు. దీనిపై ఎంపిడిఒ దివిజానను వివరణ అడగ్గా.. తాను ఇటీవలే ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించానని, జీతాల్లో కోత తనకు తెలియదన్నారు. దీనిపై కిందిస్థాయి అధికారులతో చర్చిస్తామని వివరించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న మెప్మా సభ్యులు

మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో అంగవైకల్యంపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెప్మా సిఒ వసంత్ మాట్లాడుతూ మేనరిక పెళ్లిళ్ల ద్వారా పుట్టబోయే పిల్లలు అంగవైకల్యంతో జన్మించే అవకాశం ఉందన్నారు. పౌష్టికాహార లోపంతో పోలియో వంటివి సంక్రమిస్తున్నాయని, పిల్లలు అంగవైకల్యం బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నిత్య శ్రామికుడు, తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి తెలిపారు. తెలంగాణలో ఎన్నికల ఫలితాలు ఆదివారం విడుదలైన సందర్భంగా కాంగ్రెస్ గెలవడంతో ఆయన అభినందించారు. రేవంత్‌రెడ్డి కష్టాన్ని గుర్తుచేసుకున్నారు. ఎక్కడ ఉన్నా కష్టపడి పని చేయగలడని తెలిపారు. అధిష్టానం ఆయన కష్టాన్ని గుర్తించి ముఖ్యమంత్రి పదవిని రేవంత్‌రెడ్డికి ఇవ్వాలని ఆకాంక్షించారు.

వృద్ధాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అనాథ వృద్ధులకు అండగా నిలబడి మానవతా విలువలతో ఆదుకోవడమే తమ ధ్యేమని ఏఓ మారెడ్డి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. ఆది వారం తన పుట్టినరోజు వేడుకలను సిరి వృద్ధాశ్రమంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అనాథ వృద్ధులను అక్కున చేర్చుకొని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీమణి యమ్.రాధ, కూతురు యమ్.వి.దివ్యశ్రీ, కుమారుడు యమ్.వి.నిహాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఎఓ క్రిష్ణారెడ్డి

అన్ని రంగాల్లో రాణించాలి : ఎంపీ

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విభిన్నప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నియోజకవర్గ పరిధిలోని 839 మంది విభిన్నప్రతిభావంతులకు ఎంపీ నిధులతోపాటు కేంద్ర సాధికారత మంత్రిత్వ శాఖ ఎడిఐపి పథకం కింద పలు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించేందుకు తమ వంతు కృషి చేస్తోం దన్నారు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి సచి వాలయ పరిధిలో విభిన్నప్రతిభావంతులను గుర్తించి ప్రభుత్వం వారికి అవ సరమైన పరికరాలను ఉచితంగా అందజేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ ప్రత్యేక అవసరాలు గల వారిని కూడా ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బద్వేల్ ఆర్‌డిఒ వెంకటరమణ, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, అన్ని మండలాల ఎంపిపిలు, జడ్పిటిసిలు ఎంపీడీఓలు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ పంపిణీ చేసి మహిళతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఉద్యోగులపై ఉన్నతాధికారుల శీతకన్ను

బిల్లులు చేయడంలోనూ అలసత్వం.. ఆందోళనలో సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సచివాలయ ఉద్యోగుల జీతాలను పెట్టే ఉన్నతస్థాయి అధికారులు వారిపట్ల శీతకన్నుతో చూస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022 జూలై 1న సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించారు. అప్పటి నుంచి బేసిక్ పే తీసుకుంటున్నారు. కానీ వివిధ కారణాలతో మధ్యంతరంగా పర్మినెంట్ అయిన వారివి, బదిలీ అయి వచ్చిన వారి జీతాలు సరైన సమయంలో బిల్లులు చేయకపోవడంతో అవి పెండింగ్‌లో పడ్డాయని, వాటిని చేయమని సంబంధిత ఉన్నత కార్యాలయం వైపు పదేపదే తిరిగి అడిగినా చేయకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కొందరి బిల్లులు అలాగే పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం మారడం వల్ల కూడా సప్లిమెంటరి బిల్లులు, అరియర్స్ బిల్లులు చేయకపోవడంతో నష్టపోతున్నామని చిరుద్యోగులు పేర్కొంటున్నారు. ట్యూషన్ ఫీజు, రీయంబర్స్‌మెంట్, ఎర్న్ క్యాష్ బిల్లులు కూడా చేయ డం లేదని, సంపాదిత సెలవులు తీసుకుని వెళ్లిన కూడా వచ్చిన తర్వాత సంపాదిత సెలవుల కాలంలో చేయవలసిన బిల్లు చేయడంలేదని అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక సచివాలయానికి అవసరమైన, స్టేషనరీ బిల్లులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. ఒక వైపు సక్రమంగా జీతాలు లేవు.. మరో వైపు సచివాలయాల్లో స్టేషనరీ లేదు. సంవత్సరం నుండి సచివాలయ ఉద్యోగులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆఫీసులలో బిల్లు చేసేవారు సచివాలయ ఉద్యోగులకు చేస్తే ఏమి వస్తుందని పక్కన పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. అదే కాంట్రాక్టు చేసుకున్న వారి బిల్లులు పెడితే వాటి నుంచి ఆదాయం వస్తుందని భావించి ఉద్యోగుల బిల్లును పక్కనపెట్టి కాంట్రాక్టర్ బిల్లులను చేసి సొమ్ము చేసుకుంటున్నారనే వాదన బలంగా వినపడుతోంది. ఇక ట్రెజరీలో కూడా బిల్లులు ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయం నుంచి వచ్చిన బిల్లులలో ఏవైనా తప్పులు ఉంటే చెప్పకుండా వాటిని అలాగే కాలయాపన చేస్తూ ఎక్కువరోజులు పెండింగ్‌లో పెడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా ఉన్నతస్థాయి అధికారులు, ట్రెజరరీ కార్యాలయంలోని అధికారులు సచివాలయంలోని చిరుద్యోగులపై కరుణించి సకాలంలో అన్ని రకాల బిల్లులు పెట్టాలని కోరుతున్నారు.

సిఎం జగన్‌పై వ్యాఖ్యలు అర్ధరహితం

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

బిటెక్ రవి అరెస్టయిన తర్వాత అజ్ఞానంతో మాట్లాడడం సబబు కాదని, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి సంబంధించి నువ్వు చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని పురపాలక చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, ఎపి పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాస ప్రాంగణంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో పెద్ద కొడుకులా ఉంటూ నేనున్నానంటూ ఉన్న ఏకైక నాయకుడు సిఎం జగన్ అని పేర్కొన్నారు. బిటెక్ రవి శనివారం విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సిఎం జగన్‌కు బంధువులే అన్నారు. నాలుగు పెట్టుకుని 40 కుటుంబాలు ఉండే వారిని విమర్శించడం ఏమిటని వారు ప్రశ్నించారు. పులివెందుల పట్టణ అభివృద్ధి చేసిన ఘనత వైయస్ కుటుంబానికే చెందుతున్నారు. పులివెందులలో జగన్‌రెడ్డిని ఓడిస్తానని బిటెక్ రవి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడని తెలిపారు. చంద్రబాబు దగ్గర పేరు తెచ్చుకునేందుకు ఈ ఆర్భాటాలు చేస్తున్నారన్నారు. సొంత మండలం సింహాద్రిపురంలో సర్పంచ్‌గా గెలవలేని వ్యక్తి నువ్వు సిఎంపైన విమర్శలు చేయడం అర్ధరహితమన్నారు. పులివెందుల అభివృద్ధి ఇంతగా జరుగుతుంటే సహకరించాలే తప్ప.. నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. ఒక కేసులో నిన్ను పోలీసులు అరెస్టు చేస్తే దాన్ని సిఎంపై మోపడం సిగ్గు చేట న్నారు. రాష్ట్ర అభివృద్ధి, పులివెందుల అభివృద్ధిపై కానీ బహిరంగ చర్చకు రావాలని టిడిపి నాయకులకు సవాల్ విసిరారు. పురపాలక వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ మాట్లాడారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, రసూల్, డేనియల్, రాజేష్ నాయుడు పాల్గొన్నారు.

జగన్ పాలన నచ్చక టిడిపిలోకి వలసలు

టిడిపి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో జగన్ పాలన నచ్చక వైసిపి నుంచి వలసలు వస్తున్నారని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బక్కన్నగారిపల్లెలో ఆదివారం టిడిపి నాయకుడు గణేష్ నాయక్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బిటెక్ రవి పాల్గొన్నారు. బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన గువ్వల నాగ సుబ్బయ్య, మురళి, సుధాకర్, దుపాటి మహేష్, కతమయ్య, శ్రీరాములు నాయక్, రవికుమార్, చిన్నబాబు, బండి ప్రసాద్, మహేంద్ర, అనందుల్లా, బక్క మల్లయ్య, రాజగోపాల్, మరి కుటుంబాలు టిడిపిలో చేరారు. వీరికి బిటెక్ రవి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం బిటెక్ రవి మాట్లాడుతూ సీఎం సొంత నియోజకవర్గంలోని బక్కన్నగారిపల్లెలో వైసిపి నుండి టిడిపిలోకి 20 కుటుంబాలు చేరినట్లు చెప్పారు. పులివెందుల నియోజకవర్గంలో వైసిపి పట్ల ప్రజల్లో వ్యతిరేకత చాలా ఉందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రజల కోరిక మేరకు సెల్ టవర్ వేస్తానని బిటెక్ రవి హామీ ఇచ్చారు. ఎన్ని కేసులు పెట్టినా టిడిపి నాయకులు, కార్యకర్తలు భయపడరని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, మైనార్టీ నాయకుడు నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, ఎస్పీ జయచంద్రారెడ్డి, ఆర్‌వి రమేష్, వెంకటసుబ్బారెడ్డి, అబ్దుల్, మడక శ్రీనివాసులు, డక్కా రమేష్, మహమ్మద్ ఇనాయతుల్లా, ఈశ్వరయ్య, పలువురు నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దువ్వూరు : మండల పరిధిలోని భీమునిపాడు గ్రామానికి చెందిన కుప్పన్నగారి రామాంజనేయరెడ్డి, పెద్దబోయిన పెద్ద పామిలేటి, గంగరాజు, నూతేటి నాగేశ్వరయ్య, సుబ్బారెడ్డి, నవనీస్వర్‌రెడ్డి వారి అనుచరులు సుమారు 60 కుటుంబాలు మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో వైసిపి నుండి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంపై విసుగుచెంది టిడిపిలో చేరుతున్నారని తెలిపారు. టిడిపిలో చేరిన వారందరికీ పార్టీ తాను ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. త్వరలో మనకు కూడా నియంత పాలన పోతుందని తెలిపారు. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంపై ఆయన ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. టిడిపి ప్రభుత్వం అంటే అన్నదాత ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి, మైదుకూరు నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కారపురెడ్డి సంజీవరెడ్డి, మండల నాయకులు, టిడిపి కార్యకర్తలు, కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

ఘనంగా 'నరేన్' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చెన్నూరు

పోచంరెడ్డి నరేన్ రామాంజులరెడ్డి జన్మదిన వేడుకలు గుమళ్ళ సాయికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి సీనియర్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, జడ్‌పిటిసి ముదిరెడ్డి సుబ్బారెడ్డి అన్వర్ రాజు, జి.ఎన్ గుమ్మల మధుసూదన్‌రెడ్డి, గుమ్మల శివారెడ్డి భాస్కర్ రెడ్డి మోహన్ రెడ్డి ఆదివారం స్థానిక పాతబస్టాండ్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. గ్రామంలో అభిమానులు, కార్యకర్తలు బైక్‌ర్యాలీ నిర్వహించారు. రక్తదానం శిబిరం కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెడపల్లి గణేష్ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి, సౌరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, టిఎన్ మహేశ్వర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు మైనారిటీ నాయకులు, రమణా చంద్ర సీనియర్ నాయకులు, నిత్య పూజయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

చెన్నూరు : దళితవాడలో నివాసముంటున్న ఉంటున్న చెప్పాలి చెప్పలయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా తక్షణ సాయం కింద ఆదివారం రూ. 10 వేల ఆర్థిక సాయం ఎంపిపి చీర్లసురేష్‌యాదవ్ అందజేశారు. కుటుంబానికి రావాల్సిన రూ. లక్ష త్వరలోనే అందజేసాతమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధి గారి వెంకటసుబ్బయ్య, యువ నాయకులు, టిఎన్ చంద్రారెడ్డి, సుధాకర్ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

139 పరుగులకు సెంట్రల్ జోన్ జట్టు ఆలౌట్

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ - 23 మెన్ మల్టీ డే ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీలో భాగంగా ఆదివారం కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్, రెస్ట్ ఆఫ్ జోన్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 39.2 ఓవర్లలో 139 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని సూర్యవంశం 32 పరుగులు చేశాడు. జోన్ జట్టులోని మాధవ్ 5, జానీబాష 4 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి 16.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. ఆ జట్టులోని మనోజ్ రాజు 35 పరుగులు (నాట్ అవుట్) చేశాడు. సెంట్రల్ జోన్ జట్టులోని రూకేష్ బాబు మూడు వికెట్లు తీసుకున్నాడు.

వైసిపి నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి -రైల్వేకోడూరు

మండలంలోని అనంతరాజుపేటకు చెందిన వైసిపి సీనియర్ నాయ కులు ఎస్ఎస్ సలాం ఆకస్మిక మృతి చెందడంతో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఆయన కుమారుడు షఫీ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లా డుతూ సలాం మృతి వైసిపి పార్టీకి తీరనిలోటని పార్టీకి ఆయన చేసిన సేవలను మరవలేమని అన్నారు. ఆయన మృతికి వైసిపి నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ముక్కా మధుసూదన్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు హేమలవర్మ, టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మస్తాన్, ఎంపిటిసి మల్లికార్జునలు నివాళులర్పించారు.

తులసిరెడ్డితో కలిసి సంబరాలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

విజయోత్సాహంలో కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాశక్తి - వేంపల్లె

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించినందున పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఇంటి వద్ద ఆ పార్టీ శ్రేణులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఆదివారం తెలంగాణ ఎన్నికల ఫలితాలల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీ సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం హర్షణీ యమన్నారు. ఈ ఎన్నికల ఫలితం త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రభావం చూపుతుందన్నారు. మొదటి నుండి కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లో నెహ్రూ కుటుంబానికి, కాంగ్రెస్‌కు కంచుకోట అన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీని ఓడించి కెసిఆర్‌ను దించినట్లే ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాబోవు ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఓడిస్తుందన్నారు. ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పని చేయాలని ఆయన కోరారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 6 సూత్రాల పథకం అమలు చేస్తామన్నారు. సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, రామకృష్ణ, వినయ్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో పట్టణంలోని కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా పేలుస్తూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ మీడియా సమన్వయకర్త జానకి రామకృష్ణ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్య శర్మ తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. 2024లో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ బావుటా ఎగరవేసి కేంద్రంలో అధికారాన్ని చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబయ్య, జయరాంరెడ్డి, ఖాదర్‌బాషా, పుష్పరాజ్, రాజేష్, సుబ్బరాయుడు, సంజయ్, ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పులివెందుల టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ శ్రేణులు పట్టణంలో ఆదివారం సంబరాలు జరుపుకున్నాయి. స్థానిక కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రమేష్, పులివెందుల అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యుడు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి, సింహాపురం మండల నాయకుడు శివ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు.

ప్రొద్దుటూరులో కాంగ్రెస్ జెండాలతో నాయకులు

ప్రొద్దుటూరు : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల ప్రొద్దుటూరు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్ల నమ్మకాన్ని వహించి మద్దతు తెలిపినందుకు తెలంగాణ ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు న్యాయవాది జిలాన్, పఠాన్, మహమ్మద్ రఫీ, ఆంజనేయులు, రషీద్ ఖాన్, భాస్కర్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

నగరంలో కాంగ్రెస్ సంబరాలు

కడప : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి, స్వీట్లు స్వీట్లు పంచిపెట్టి సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన తెలంగాణ ప్రజలకు మొదటగా శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణలో పార్టీ విజయానికి కృషి చేసిన రేవంత్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పార్టీ నాయకులు వెంకట రమణారెడ్డి, పటాన్ అలీఖాన్, కుళ్లాయప్ప, హరి ప్రసాద్, మామిళ్ళ బాబు, మధు రెడ్డి, అబ్దుల్ రసూల్, సిద్దయ్య, గంగయ్య, కోటపాటి లక్ష్మయ్య, లావణ్య నాగరాణి, సంతోషమ్మ, గౌరీ, రాజు, సుబ్బు, నంది మండలం వెంకట సుబ్బయ్య, నందిమండలం సుశీల్, అఖిల్, గంగయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఉజ్వల్ యోజనను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లను నిరుపేదల సద్వినియోగం చేసుకోవాలని శ్రీ బాలాజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ శీలం సరోజా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని లక్కిరెడ్డిపల్లి, చౌటుపల్లి సచివాలయాల్లో చేసిన వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు కేంద్రప్రభుత్వం ఉజ్వల్ యోజన పథకం కింద గ్యాస్ సిలిండర్, స్టౌవ్ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. గతంలో ఉజ్వల్ యోజన పథకం కింద 502 కనెక్షన్లు పంపిణీ చేశామని వారికి రూ.300లు సబ్సిడీ వర్తిస్తుందని, సబ్సిడీ రానివారు ఆధార్‌కార్డుతో గ్యాస్ ఏజెన్సీలో సంప్రదిం చాలన్నారు. మండల మండల వ్యవ సాయఅధికారి రమేష్ బాబు మాట్లాడుతూ వ్యవసాయదారులు పంట పొలాలు, మామిడి తోటలకు క్రిమిసంహార మం దులు పిచికారి చేసు కోవడానికి డ్రోన్ సుల భతరంగా ఉం టుందని తక్కువ ఖర్చుతో మందులు పిచికారి చేసుకోవచ్చుని అన్నారు. 40 శాతం సబ్సిడీతో డ్రోన్ అందిస్తుందని పేర్కొన్నారు.

మహారాజశ్రీ కడప ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 48/2022

O.S.No. 415/2016

N.Mallesh having died his legal heairs.
1. N.Gowridevi, W/o Late N.Mallesh, aged 40 years, Hindu, House wife.
2. N. Venkata Nivas, S/o Late N.Mallesh, aged 19 years,
3. N. Nadini, D/o Late N.Mallesh, aged 15 years, All are Residing at D/No.39/515-13, Y.S.Nagar-1, Chinnachowk, Kadapa.

...D.Hrs.

Vs

Shaik Mubarak Ali, S/o Shaik Shabbir Basha, aged 40 years, Real Estate Business R/D.No. 5/454, Corporation, D/No.48/454, Opp.C.G.R. School, Ravindra Nagar, Kadapa.

...J.Dr.

U/021 Rule R43 NOTICE TO J.Dr.

పిటిషనర్/P. మీ పైన E.P.ని Movable Properties జప్తు కొరకు పై E.P.ని దాఖలు చేసివున్నారు. కనుక మీరు 8/12/2023 తేదీన ఉదయం 10గం॥ 30ని॥లకు పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యడల తెలుపుకొనవలెను. అట్లు లేని యడల మీ పై ..ని పరోక్షంగా తీర్మానించబడును.

జి.శ్రీనివాసులునాయుడు
D.Hr తరపున అడ్వకేటు,
కడప.